రాయల్టీల రూపంలో సంపదను తరలిస్తూ, కార్మికులను నికృష్ట దోపిడీకి గురిచేస్తున్న మారుతీ - సుజుకీ యాజమాన్యం

భారతదేశంలో పెట్టుబడులు పెట్టవలసిందిగా ప్రపంచదేశాలనాకర్షించేందుకు ఎన్‌డిఏ పాలకులు 'మేక్ ఇన్ ఇండియా' నినాదంతో, ఎన్నెన్నో ఆకర్షణీయమైన రాయితీలను, సౌకర్యాలను కల్పిస్తున్నారు. భారతదేశ ఆర్థిక వ్యవస్థను అభివృద్ధిబాటలో నడపటంతోపాటు, దేశంలో పెద్దఎత్తున ఉద్యోగావకాశాలను కల్పించే పేరిటే ఇదంతా సాగుతోంది.

ఏమైనా నోకియా, ఫాక్స్‌కాన్ మొదలైన కంపెనీల విదేశీ ప్రత్యక్షపెట్టుబడుల అనేక అనుభవాలు, ఉద్యోగాల కల్పన ఓ భ్రమేననే విషయాన్ని స్పష్టంగా రుజువుచేశాయి. ఏ క్షణంలోనైనా తొలగించగలిగే కొన్ని ఉద్యోగాలనే తప్ప స్థిరమైన, నాణ్యమైన ఉద్యోగాలనేమీ వారు కల్పించలేదు. దేశం నుండి సంపదను తరలించేందుకు – ముఖ్యంగా రాయల్టీలపేరిట తమ మాతృసంస్థలకు సంపదను తరలించేందుకు – తాము సూపర్ లాభాలను గడించేందుకు – కార్మికులను, ఉద్యోగులను నికృష్ట దోపిడీకి గురిచేశారనేది కూడా అంతే వాస్తవం.

మారుతీ సుజుకీ పరిశ్రమ జపాన్‌లోని తన మాతృ కంపెనీ అయిన సుజుకీకి రాయల్టీల రూపంలో దేశంలోని సంపదను ఎలా తరలించిందో గమనిస్తే ఈ విషయం మరింత స్పష్టమౌతుంది. మారుతీ సుజుకీ రాయల్టీల రూపంలో చెల్లించటం గత 10 సం॥ల కాలంలో మూడురెట్లు పెరిగింది. 2005-06 కాలంలో 13 శాతంగా వున్న చెల్లింపులు, 2014-15 నాటికి 36 శాతానికి పెరిగాయి. 2009-10 నుండి 2014-15 కాలంలో మారుతీ సుజుకీ రాయల్టీల రూపంలో జపాన్‌కు అక్షరాలా 1,26,679 కోట్ల రూపాయలను తరలించింది. అత్యధిక రాయల్టీ చెల్లింపుపై పరిమితిలేదని, ఎటువంటి ప్రశ్నలకు గురికాకుండా, నిరాటంకంగా మారుతీసుజుకీ అధిక మొత్తాలను రాయల్టీల రూపంలో తరలిస్తోందని స్పష్టమౌతున్నది.

2009-10 నుండి సుజుకీకి చెల్లిస్తున్న రాయల్టీ నిలకడగా పెరుగుతూ 2011-12, 2012-13 నాటికి అత్యధికంగా 46 శాతానికి చేరుకుంది.

2009లో ప్రభుత్వం మన దేశంలోని కంపెనీలు వారి మాతృదేశంలోని కంపెనీలకు చెల్లించే రాయల్టీలపై విధించిన నిబంధనలను సడలించి, విదేశీ పరిశ్రమలు తమ చిత్తమొచ్చిన రీతిలో సంపదలను తరలించేందుకు మరింత అవకాశం కల్పించింది. గతంలో విదేశీ పరిశ్రమల రాయల్టీల చెల్లింపులు తమ మూలధనంలో పదిశాతాన్ని దాటి వుండటం అరుదుగా వుండేది. అయితే, భారతదేశంలోని తమ అనుబంధ పరిశ్రమల ద్వారా రాయల్టీల రూపంలో ఎంత విచ్చలవిడిగా లూటీ చేయవచ్చో మారుతీ సుజుకీ పరిశ్రమ ఆచరణ స్పష్టం చేస్తోంది.

భారతదేశంలోకి ప్రవేశించిన విదేశీ పెట్టుబడి ఇతర అనేకానేక పద్ధతులతోపాటుగా రాయల్టీల రూపంలో కూడా దేశ సంపదను ఏ స్థాయిలో తరలించు కెళ్తుందనే అంశాన్ని ఎంతో ముందుగా గ్రహించి కామ్రేడ్ తరిమెలనాగిరెడ్డి 'తాకట్టులో భారతదేశం' గ్రంథంలో హెచ్చరించారు. పరిమిత పరిధిలో ఇది – మారుతీ – సుజుకీ వాటాదారులకు కలిగే నష్టంలా కన్పడినప్పటికీ వాస్తవ అర్థంలో దేశ సంపద ప్రవాహంలా తరలిపోతూ దేశ ఆర్థికవ్యవస్థను కునారిల్లజేయటమే జరుగుతోంది.

ఈవిధంగా ఒకవైపున మారుతీ-సుజుకీ పరిశ్రమ మరింతగా, మరింతగా లాభాలనార్జిస్తూ, తన మాతృ దేశంలోని కంపెనీకి రాయల్టీలపేరిట భారీ మొత్తాలను తరలించివేస్తూనే, మరోవైపున మనదేశంలోని కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతోంది.

2012 జులై 18న మానేసర్‌లోని మారుతీ – సుజుకీ పరిశ్రమలో తలెత్తిన పారిశ్రామిక ఘర్షణ తర్వాత, పనుల నుండి తొలగించబడిన కార్మికుల జీవితాలను ఒక్కసారి పరిశీలిస్తే, వారంతా తమ జీవన మనుగడకోసం, గౌరవనీయమైన జీవనాధారాన్ని పొందటం కోసం కఠోర ప్రయత్నాలు చేసినా ఫలితం దక్కటంలేదు. భారత ప్రభుత్వంతో షరీకైన దేశ, విదేశీ బడా పెట్టుబడిదారులు కార్మికుల జీవితాలతో అమానవీయంగా ఆడుకుంటూ వారి జీవితాలను ఘోరంగా దిగజారుస్తున్నారు.

2012 జులై ఘటన తర్వాత, 150 మంది కార్మికులను వారి ఇండ్లనుండి పోలీసులు నిర్బంధంలోకి తీసుకొని, వారిని భోండ్సి జైలులో నిర్బంధించారు. హత్యానేరంతోసహా భారత నేరస్మృతిలోని 18వ సెక్షనును కూడా వీరిపై బనాయించారు. మరో 60 మంది కార్మికులు గైర్హాజరీలో వున్నట్లుగా పేర్కొన్నారు. దాదాపు 2500 మంది కార్మికులు శాశ్వతంగా విధుల నుండి మూకుమ్మడిగా తొలగించబడ్డారు.

2012 జులై నుండీ, నిర్బంధించబడిన కార్మికుల బెయిల్ విజ్ఞప్తులను కోర్టు తిరస్కరించటంతో దీర్ఘకాలం వారంతా జైళ్ళలోనే గడిపారు. 2013 మేలో నిర్బంధంలో వున్న కార్మికుల బెయిల్ విజ్ఞప్తిని పరిశీలించిన పంజాబ్, హర్యానా ఉమ్మడి హైకోర్టు, 'ప్రపంచపు అంచనాలో భారతీయ ప్రతిష్టను దిగజార్చివేసిన అత్యంత దురదృష్టకర ఘటన ఇది' అని వ్యాఖ్యానించింది. అంతేగాక, 'విదేశీ

మదుపరులు కార్మికులలో నెలకొన్న అశాంతి కారణంగా భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు విముఖత వ్యక్తం చేస్తున్నారు' అని కూడా పేర్కొంది.

ఈవిధంగా 'నిష్పాక్షిక వ్యవస్థ'గా చెప్పబడుతున్న న్యాయస్థానాలు కూడా విదేశీ ప్రత్యక్ష పెట్టుబడికి మద్దతుగా, భారతదేశంలో కార్మికులపై వారు సాగిస్తున్న దోపిడీని సమర్థిస్తూ వ్యాఖ్యానించాయి.

జైలులో వున్న 150 మందిలో 114 మంది రెండున్నర సం॥ల జైలు జీవితం తర్వాత బెయిల్‌పై విడుదలయ్యారు. జైలు నుండి బయటకొచ్చిన వీరంతా మరేదైనా ఉపాధి కోసం ఎన్నో ప్రయత్నాలు చేసి విఫలమయ్యారు. దాదాపు వీరంతా ఐటిఐ చదువుకొని, ఆయా ప్రత్యేక పనులలో అనుభవం, నైపుణ్యం కలిగివున్నవారే. వాస్తవానికి మారుతీ సుజుకీ అపరిమిత లాభాలు సంపాదించటానికి కీలకమైన నైపుణ్య కార్మికులే వీరంతా!

ఈ కార్మికులు, జైలు జీవితం గడిపిరావటం కారణంగా వారి అనుభవం, నైపుణ్యంపై ఆధారపడి ఓ గౌరవనీయమైన జీవనోపాధిని పొందలేకపోతున్నారు. వారికి ఉపాధి కల్పించేందుకు ఎవరూ ముందుకు రావటంలేదు. ఎవరైనా ఒకవేళ ఉద్యోగం ఇవ్వటానికి సిద్ధమైనప్పటికీ, పోలీసులు ధృవీకరణ చేయక పోవటంతో వారికి ఆ ఉద్యోగం నిరాకరించబడుతోంది.

మారుతీ–సుజుకీ యాజమాన్యం కార్మికులను జైలుకు పంపటం ద్వారా వారిపై కళంకితులనే ఓ ముద్రవేసి, ఎటుపోయినా వారిని వెంటాడుతోంది. కంపెనీ ఆస్తులను ధ్వంసం చేశారనేది వారిపై మోపిన అభియోగమైనప్పటికీ, హత్యకేసులో దోషులుగా వారిని ఆరోపిస్తున్నారు. మారుతీసుజుకీ కార్మికులను చుట్టు ముట్టిన దుర్మార్గమైన పరిస్థితులీవిధంగా వున్నాయి.

ప్రస్తుతం ఈ కార్మికులు రహదార్ల నిర్మాణం, బరువులను మోయటం, దుస్తుల పరిశ్రమల్లో బట్టలు ప్యాక్ చేయటం, లేదా వ్యవసాయ పనుల వంటి వాటిని వెతుక్కొని వెళ్తున్న దుస్థితి నెలకొంది. అదే సమయంలో క్రమం తప్పకుండా న్యాయస్థానంలో జరిగే విచారణలకు హాజరుకావలసిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు.

జీవనోపాధి కోసం మారుతీ – సుజుకీ కార్మికులు ఎదుర్కొంటున్న దుస్థితి ఇలా వుంది. ప్రవాహంలా తరలిపోయే సంపదతోపాటుగా, భారతదేశంలో విదేశీ ప్రత్యక్ష పెట్టుబడి యొక్క దుష్పరిణామాల్ని ఈ కార్మికుల చేదు అనుభవాలు ఎత్తిచూపుతున్నాయి. నిశ్చయాత్మకంగా ఈ దుర్మార్గ విధానాలపై పోరాటం చేయాలని ఈ పరిస్థితులు కార్మికవర్గాన్ని డిమాండ్ చేస్తున్నాయి.

oooooo